ఎక్స్‌ప్రెస్ రైళ్లు అన్నీ నిలపట్లే

- ఆగేవి నాలుగు.. వెళ్లేవి ఐదు
- దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు
- జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో పరిస్థితి



జమ్మికుంట రైల్వేస్టేషన్

హుజూరాబాద్: ఉత్తర తెలంగాణలోనే జమ్మికుంటకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ వ్యవసాయ మార్కెట్ ఉండటంతో వ్యాపార కేంద్రంగా నిలుస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కూడా. రెండు, మూడు నియోజకవర్గాల్లోని 125 గ్రామాల ప్రజలు ఇక్కడికి వివిధ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, వ్యాపార పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఇక్కడి రైల్వే స్టేషన్ గుండా 9 ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్తున్నాయి. కానీ, వాటిలో ఇక్కడ నాలుగే నిలుస్తున్నాయి. ఫలితంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యయప్రయాసల కోర్చి వరంగల్, ఖాజీపేట, రామగుండం రైల్వేస్టేషన్లకు వెళ్తున్నారు.

జీఎంకు విన్నవించినా ఫలితం లేదు

చెన్నై నుంచి ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రధాన రైలుమార్గం జమ్మికుంట. అయినా ఢిల్లీ, చెన్నై లాంటి దూర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే ఇతర రైల్వేస్టేషన్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. జమ్మికుంట స్టేషన్‌కు వచ్చిన జీఎంకు ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలంటూ వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఫలితం లేకపోయింది.

నిలిచేవి.. నిలపాల్సిన రైళ్లు

భాగ్యనగర్, తెలంగాణ, అండమాన్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్(హైదరాబాద్ నుంచి వచ్చేది) రైళ్లు జమ్మికుంట స్టేషన్‌లో నిలుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, పాట్నా, దానాపూర్, నాగ్‌పూర్, ఢిల్లీ నుంచి వచ్చే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాల్సి ఉంది.

రైల్వేస్టేషన్‌లో సమస్యలు

ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో జమ్మికుంట రైల్వేస్టేషన్ ఆదర్శ స్టేషన్‌గా రూపుదిద్దుకుంది. కానీ, ప్రస్తుతం పలు సమస్యలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కొత్తపల్లి నుంచి జమ్మికుంటకు వెళ్లేందుకు పాదచారుల కోసం ఫుట్‌పాత్ వంతెన, పిల్లలు, వృద్ధులు మొదటి ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లడానికి లిఫ్ట్ సిస్టం ఏర్పాటు చేయాల్సి ఉంది.

వంతెన నిర్మించాలి



ఫుట్‌పాత్ వంతెన లేకపోవడంతో స్టేషన్ వద్ద ఆగివున్న రైలు కింది నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో గతంలో చాలా ప్రమాదాలు జరిగి, పలువురు ప్రాణాలు కోల్పోయారు. వెంటనే వంతెన నిర్మించాలి.

– బొల్లి నిర్మల, కొత్తపల్లి

ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ ఆపాలి



రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నింటినీ ఆపాలి. గతంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. కానీ, ఫలితం లేదు. ఇప్పటికైనా రైళ్లను ఆపేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– ఎండీ.సలీం పాషా, జమ్మికుంట

నిధులు స్వాహా చేస్తే ఉపేక్షించబోం



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ సంధ్యారాణి

- డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సంధ్యారాణి
- చిగురుమామిడిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక
- 1.51 లక్షల రికవరీకి ఆదేశం

చిగురుమామిడి: ఈజీఎస్ నిధులను ఎవరు స్వాహా చేసినా ఉపేక్షించబోమని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సంధ్యారాణి హెచ్చరించారు. శుక్రవారం చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అడిషనల్ పీడీ మాట్లాడుతూ.. రూ.2.58 కోట్ల విలువైన ఈజీఎస్ పనుల్లో రూ.1.51 లక్షల దుర్వినియోగం జరిగినట్లు తేల్చామన్నారు. అవి కూడా తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనుల్లోనేనని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సర్పంచ్‌ల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. లంబాడిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.1,000 జరిమానా విధించామన్నారు. కొండాపూర్, సీతారాంపూర్, ఉల్లంపల్లి, ఇందుర్తి గ్రామాల పంచాయతీ కార్యదర్శులకూ జరిమానా వేశామని తెలిపారు. గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలన్నారు. సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి వెంకటరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, డిప్యూటీ తహసీల్దార్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

నేతన్న విగ్రహావిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి ఇందిరానగర్‌లో నేతన్న విగ్రహాన్ని శాలపల్లి భక్త మార్కండేయ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, సామాజికవేత్త, హెచ్‌సీఎల్ సీనియర్ డైరెక్టర్ సబ్బని వెంకట్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, సర్పంచ్ శారద పాల్గొన్నారు. నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర కార్యనిర్వహణాధికారి కొమ్ముటిపల్లి సదానందం, ఎంపీటీసీ సభ్యురాలు గడ్డం లలిత, పద్మశాలీ జిల్లా కో–కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువా కప్పుతున్న బల్మూరి వెంకట్

జమ్మికుంట: జమ్మికుంట హమాలీ వర్కర్స్, లేబర్ యూనియన్ అధ్యక్షుడు వొల్లాల శ్రీనివాస్, బీఆర్ఎస్ కార్మిక విభాగం హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మారపల్లి శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు ఎండీ.సలీం పాషా, బండి కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



శంకరపట్నం: కాంగ్రెస్ పార్టీ మెట్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా గొట్టిమల్లె మధు, ఉపాధ్యక్షుడిగా అడప సంపత్ శుక్రవారం నియమితులయ్యారు. వారిని మండల శాఖ అధ్యక్షుడు బసవయ్య, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సంపత్, పోచయ్య, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



అశ్మిత

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోగం అశ్మిత గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తండ్రి సుదర్శన్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో అయిదో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు జనవరి 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వాతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైతే వచ్చే 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు గురుకుల వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

సామగ్రి చోరీ.. ఇద్దరిపై కేసు

జమ్మికుంట: నిర్మాణంలో ఉన్న ఇంట్లో నుంచి సామగ్రి చోరీ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మడిపల్లి గ్రామానికి చెందిన ఒల్లాల మూరార్జి నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. శుక్రవారం అక్కడ ఎవరూ లేని సమయంలో జమ్మికుంట పట్టణానికి చెందిన శాంత, రాధ వెళ్లి, విద్యుత్ వైర్ బెండళ్లు, గ్రీజర్, కిటికీ గ్రిల్స్, స్విచ్ బోర్డులు, బాక్స్‌లుతోపాటు ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.80 వేలు ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

టీషర్టుల పంపిణీ



రామడుగు: రుద్రారం గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి మల్యాల లింగయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రూ.20 వేల విలువైన టీషర్టులను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రంగనాథశర్మ, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలి



చొప్పదండి: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ప్రత్యేకావసరాల పిల్లలు వినియోగించుకోవాలని ఎంఈవో అంబటి వేణు కోరారు. కేంద్రంలో శుక్రవారం ప్రత్యేకావసరాల పిల్లలకు ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి వైద్య సేవలందించారు. ప్రతీ శుక్రవారం ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి(హుస్నాబాద్): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. గత తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో ఆశించినంత అభివృద్ధి జరగలేదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయినప్పటికీ కాల్వల పనులు చేపట్టలేదన్నారు. పేదలకు రేషన్‌బియ్యంతోపాటు మరో ఎనిమిది సరుకులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. బస్‌ల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో, కారు డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకోల రాజయ్య, అనుమోజు జనార్దన్ ఉన్నారు.

అన్నారం పల్లె దవాఖానా సందర్శన



ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందంతో వైద్యులు, సిబ్బంది

మానకొండూర్: మండలంలోని అన్నారం పల్లె దవాఖానాను నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో జువేరియ, డీపీవో రవీందర్, డాక్టర్ గోపాల్, అలేఖ్య, సీహెచ్‌వో రాజునాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపిక



రవిచందర్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రామడుగు: గుండి గ్రామానికి చెందిన మడ్డి రవిచందర్ హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించే జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు. అతను ఎన్ఎస్ఎస్ వలంటీర్, కరీంనగర్ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ఈ సందర్భంగా రవిచందర్‌ను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గోపికృష్ణ, సతీశ్, సంపత్‌కుమార్, ఎండీ.అలీఖాన్, శ్రవన్‌కుమార్, రామేశ్వరరావు, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణంపై ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి, నిర్మాణం చేపడుతున్నాడని స్థానిక మాజీ వార్డు మెంబర్ రవిచందర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రజిని, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లను కలిసి, ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కరీంనగర్: గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకునేందుకు శనివారం కరీంనగర్‌లోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశానికి సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై వాటి ప్రభావాలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించడానికి ఈ ప్లీనరీ సమావేశం తోడ్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న నాయకులు

కరీంనగర్: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా 8 సెంటర్లలో స్వాతంత్య్రం ప్రజాస్వామ్యం, సోషలిజం జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్, నాయకులు ఓదెలు, సుధీర్, మనోజ్, అపర్ణ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన సద్వినియోగం చేసుకోవాలి







గుండ్లపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, వెదిరలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మానకొండూర్: అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్..

గన్నేరువరం: ఆరు గ్యారంటీ పథకాల అమలుకు నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గుండ్లపల్లి, గునుకులకొండాపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అధికారులతో కలిసి, దరఖాస్తులు స్వీకరించారు. పేద ప్రజలు ఇబ్బంది పడకుండా వారి వద్దకే వచ్చి, అర్జీలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గన్నేరువరంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం, కస్తూరిబాగాంధీ పాఠశాల భవనాల నిర్మాణానికి అధికారులు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో జెడ్పీ సీఈవో పవన్, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు బెతేల్లి సమత, లింగంపల్లి జ్యోతి, చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచు చింతల పద్మ, ఏవో కిరణ్మయి, ఏపీఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆముదాలపల్లిలో పర్యటించారు. కొత్త రేషన్ కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభయహస్తం గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. అంబాల్‌పూర్, అర్కండ్ల, చింతగుట్ట, ఆముదాలపల్లిల్లో అధికారులు ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో బషీరొద్దీన్, ఏవో శ్రీనివాస్, సర్పంచ్‌లు మానస, అనిత, రజిత, వసంత పాల్గొన్నారు. మెట్‌పల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన తోట బసవయ్య–లచ్చమ్మ దంపతుల ఇంటిని ఎమ్మెల్యే పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రామడుగు: ప్రజాపాలన గ్రామసభ తర్వాత కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. రామడుగు మండలంలోని వెదిర, గోపాల్‌రావుపేట గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. వెదిరలో అదనపు కలెక్టర్ పర్యటించి, అర్జీల స్వీకరణను పర్యవేక్షించారు. గ్రామసభ మరుసటి రోజు కూడా జీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి, దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ కలిగేటి కవిత, ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ భాస్కర్, సర్పంచ్‌లు తీగల సంగీత, కర్ర సత్యప్రసన్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్డీవో మహేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, గునుకులపల్లె గ్రామాల్లో అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దరఖాస్తు తీసుకున్న మరుక్షణమే ప్రజలకు రశీదు ఇవ్వాలన్నారు. చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, తహసీల్దార్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: ప్రజా పాలనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. జనవరి 06 వరకు ప్రతీరోజు ఉదయం 08 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 1, 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29వ వార్డుల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30వ వార్డుల్లో అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో ఎస్.రాజు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్, ప్రజా పాలన ప్రత్యేకాధికారి పద్మావతి, వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంతోపాటు చొప్పదండి మండలంలోని చిట్యాలపల్లి, గుమ్లాపూర్, దేశాయిపేట గ్రామాల్లో శుక్రవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, మండల ఇన్‌చార్జి అధికారి దేవేందర్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో స్వరూప, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 30 వార్డుల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ప్రత్యేక కేంద్రాలను స్పెషల్ ఆఫీసర్ జనార్దన్‌రావు (డీఈవో), మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పర్యవేక్షించారు. జమ్మికుంట మండలంలోని కోరపల్లి, మాచనపల్లి, మడిపల్లి, నాగారం గ్రామాల్లో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. తహసీల్దార్ రజిని, ఎంపీడీవో కల్పన, ఆర్ఐలు తిరుపతి, సంతోష్ తదితరులున్నారు.



ఇందుర్తిలో ఆర్డీవో మహేశ్వర్..



హుజూరాబాద్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు..

సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లి, ఎగ్లాస్‌పూర్, ఎలబోతారం, ఘనపూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏడు కౌంటర్లలో ప్రారంభించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, తమ అర్జీలు అందజేశారు. సర్పంచ్‌లు యుగంధర్‌రెడ్డి, శిరీష, వెంకటరెడ్డి, రాజిరెడ్డి, ఎంపీటీసీ చాడ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి, కొండపల్కల గ్రామాల్లో శుక్రవారం దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ పర్యవేక్షించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి, గడ్డివానిపల్లి, కనగర్తి, లక్ష్మాజిపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు.



చిట్యాలపల్లిలో ఎంపీపీ, అధికారులు..



జమ్మికుంట: మాట్లాడుతున్న తహసీల్దార్ రజిని



దుద్దెనపల్లిలో తహసీల్దార్ మంజుల

రథశాల మరమ్మతుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ట్రస్టీలు, దాతలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం(బొమ్మల గుడి) వేద పండితుడు, ట్రస్టీ కొండూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రథశాల మరమ్మతుకు శుక్రవారం భూమిపూజ చేశారు. బొమ్మలగుడి దేవాలయం పురాతనమైందని, అన్నపూర్ణ సేవా సమితి, దాతల సహాయంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ సతీశ్‌కుమార్, చందా పరిజాతం, విశ్వనాథం, దాతలు, భక్తులు పాల్గొన్నారు.